# కాశ్మీర మజిలీలు

శ్రీ జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తిగారు

(నాటిరేయి)

బోండామనుమరాలు కాబోలు పదేండ్ల బాలిక చిన్నపళ్లెములో కొన్నికిళ్లీలుంచి గుమ్మముకడ నిలిచినది. ఆరాత్రివేళ బాలిక కూడ అతిథిసత్కారమున నెట్లుపాల్గొనుచున్నదో! ఆశ్చర్యముతో ఆనందముతో నామనస్సు నిండిపోయినది. ఆమెను చూడగనే వెనుక భటిండాలో పరిచితమైన సురుచ్ జ్ఞప్తికివచ్చినది. ముద్దుతో ముచ్చటతో బాలికను పలుకరించి "అదేమి? అమ్మా!" అని ప్రశ్నించితిని. "పాన్ లీజియే" ("తాంబూలము తీసికొనుడు") అని ఆమె ప్రత్యుత్తరమిచ్చినది. వసారాకును వీధి గుమ్మమునకును నడుమగల చిన్నిహాలులోని చాపపై బోండాచతికిలపడి "బైఠియే" యని నన్ను ఆహ్వానించినాడు. "అచ్ఛా!" అని యిరువురకు ప్రత్యుత్తరమొసిగి బోండాకెదుట జతికిలపడితిని. బుడంకాయికూడ చాపపై చేరినాడు. పళ్లెమును బాలిక మామోలనుంచినది. ఆపల్లెలో వారికి తమలపాకు లెట్లు లభించినవో! బాలికను సమీపమున కూర్చుండ బెట్టుకొంటిని. ప్రక్కగదిలో బోండాభార్యా అక్కా కూర్చుండిరి. మామా ప్రాంతాలనుగుఱించిన ప్రసంగములు జరిగినవి. ఈ అమాయికులకు ఆధ్యాత్మికవిషయములే రుచించునని యెఱుగుదును. రామచంద్రుడు మా ప్రాంతాలలో మసలినాడనియు గోదావరి నాజన్మస్థలమునకు సమీపమందేయున్నదనియు రామేశ్వరము మాకెంతో దూరమునలేదనియు యాత్రార్థమై మాప్రదేశమునకు రండనియు నేను పలికినంతనే వారు పరమానంద భరితులైరి.

ఆహా! ఎట్టి పవిత్రజీవులు! రామచంద్రుడనినంతన గోదావరి యనినంతన రామేశ్వరమనినంతన వారి ముఖములందు పవిత్రమైన తేజస్సు తళ్కొత్తినది! సూర్యునిలో ఉజ్జ్వలమైనకాంతి వెలయునట్లు, విశ్వాసమందు సద్భక్తి యొప్పుచుండునుగదా! సంశయాత్ములమైన విద్యాధికులము వాదప్రతివాదములు సలుపుచు భూమ్యాకాశముల నడుమ నలాడుచుండ నమాయికులైన ఈ పల్లెవాసులు విశ్వాసమును భక్తిని రెక్కలు జేసికొని రివ్వురివ్వున స్వర్గ వీథులలోనికెగసిపోగలరు. "పల్లెలకు తరలు"డని పెదలనుచుందురు. "తరలుట ఆర్థికసమస్యాపరిష్కారమునకుగాక ఆధ్యాత్మిక విద్యాభ్యాసమునకై" అని నేను కంఠమెత్తి వచింతును.

మేము ప్రసంగించుకొనుచుండగా గృహిణి లేచి దొడ్డి వసారాలోనికిపోయి కుంపటినిండ నిప్పులుపోసి మాకనతిదూరమున బెట్టినది. చలితీవ్రముగను, ప్రత్యేకించి మాకు నుస్స

హాముగను ఉండుట ఆమె గ్రహించినది. ప్రశాంతమైన ఆసమయమున పవిత్రచిత్తులైన ఆపల్లెకుటుంబస్థులతో ప్రసంగించుచుండగా నామనసున అపూర్వమైన భావస్రవంతి ప్రవహించినది. హృదయమున నిహితమైన శక్తులకును, పల్లెవాతావరణమునకును ఎంత దగ్గఱిచుట్టఱికము కలదో! నగరములందన వరతము వినబడు కర్కశశబ్దములుకాక పల్లెలందు వినబడు పిల్లతెమ్మెరల గుసగుసలే ఆత్మనలరించి, అంతరంగమున నిదురించుచుండిన శక్తులను లేపునని గ్రహింపగలిగితిని. కడుపున నొకభావము నిడికొని నాల్కనుండి వేఱుమాటను జారవిడచు నాగరకుల ప్రోలనున్నపుడు మనసునకు దురంతమై యాతన కలుగుననియు, కల్మషరహితులైన జానపదులు హృదయములు విప్పి ప్రసంగించుచుండ నెచటనుంటిమేని, నుదువుల కందనిహాయి, నందనమునమసలు పరిమళమువలె, మనసున నడయాడుననియు స్వానుభవమువలన దెలుపగలను.

మేము ఇష్టాగోష్ఠి సలుపుచుండగనే పొట్టి ఓచికి చాపపై వ్రాలి నిదురించినాడు. బోండాలేచి మాకై రెండు మంచములను అందు వేయబోయినాడు. "మంచములు వలదు అరుగుపై పరుందుము. రగ్గులున్నవి చలిభయములే"దని పలికితిని.

అనంతరము మేము మువ్వురము అవ్వలి కరిగితిమి. అరుగులపై నేదో రొట్టదట్టముగా పడియున్నది. కుడి అరుగుపై రొట్ట లోనే బోండా వెలికిలబడి "బాబూజీ! నేను ప్రతిదినమూ యిందే పరుందును. ఆ అరుగులపై మీకు మంచములు వేయింతును" అనినాడు. బోండా పద్ధతినే అవలంబింపవలెనని మక్కువ పడితిని. స్వస్థలమైన పేరవరమును వీడకమున్ను రాత్రులందు నాతండ్రిగారితో పొలములందు విడియు వాడను. ఒత్తుగ గడ్డిపఱచి పాలేరులు మాకు శయ్యనేర్పఱచువారు. దానిపై వెలికిలబడి, నిస్తబ్ధనిశీథినీ సమయమున నీలాకాశమున వెలయు నక్షత్రముల నవలోకించుచు, చల్లని పిల్లవాయువు శరీరమును స్పృశించుచు నంతరంగమున నెంతో హాయిని బుట్టించుచుండ నల్లన దాని ననుభవించుచు, అసంఖ్యాకములై కూడియు నించుకంతైన రొదచేయక అంతరిక్షమున తారకలు నోళ్లు మెదల్పని తాపసులట్లు ఏల, ఎట్లు వసించుచున్నవో యని తలపోయుచు, ఎంతో దూరమున నొక్కొక దిక్కునుండి అపుడపుడు పక్షికూజితము చెవిబడినపుడు ప్రశాంతమైన ప్రకృతి గృహమున నదెట్టి సుఖజీవితమును కడపుచున్నదో యని యూహించుచు, అదూరమున వెన్నెలలో నిలిచి, భావమననము గావించుకొను కవి మానసమువలె, నెమరువేయుచుండు పశువులగుంపు జూచుచు, ఒక్కొక ముహూర్తమున పాలేరు పాడు ఏలపాటకు వీనులొగ్గి గంగోత్తరినుండి జాలువారు పూతధారవలె నిర్మలినమైన వాని గుండెనుండి వెలారు మధుర స్వనమందలి మహత్త్వమునకు జోహార

నుచు, మేల్కాంచియే ఆనందస్వప్నము లల్లుకొనుచు, బ్రతికియుండియే స్వర్గసుఖము ననుభవించుచు, నొకప్పుడు నేను కడపిన దినములు జ్ఞప్తికివచ్చి నా స్మృతిపథమున నానందలహరిని ప్రవహింపజేసినవి. ఆహా! స్మృతి ఎంత మధురమైనది! ఎంత మహిమోపేతమైనది! బాల్యమున ననుభవించిన నాహాయి కలకత్తా మహానగరమున ప్రవేశించినంతనే కడతేఱినది. దేశభ్రమణము సలుపుతఱి కొండలందును, వనములందును, పొలములందును, పల్లెలందును విడియు తరుణములు లభించినపుడు మరలనట్టి హాయిని జుఱ్ఱువాడను. పఠితలు మానసికముగ నన్నను గమించిరేని, కాలక్రమమున వారి నీ ప్రదేశములకు గొనిపోదును. ఈ యుదంతమును చదువుతఱి ఆంతరంగికముగ వారు హిమగిరి దృశ్యములందు విడియుదురని, పచ్చని చేలందు, చక్కని తోటలందు, మంచెలందు, ప్రశాంతములైన పల్లె ప్రాంగణములందు మానసికముగ పన్నుండి హాయినందెదరని ఆశపడుచున్నాను. నాటి ఆనందమును దలపోసి, మంచముపై పరుండుటకంటె బోండావలె రొట్టమీదనే పరుండుట మేలని గ్రహించి "మంచములు వలదు. రొట్టలోని హాయి నెఱుగుదు"నని పిన్ననాటి యుదంతమును సంక్షేపముగ వానికి దెలిపితిని. నానిశ్చితము నెఱిగి, బోండా అచ్చెరువొందినాడు. అతని అక్కాయిల్లాలూ ఇంచుక దుఃఖించిరి.

వారేమి అనుకొనినఅనుకొనెదరు గాక! నాటిరేయి అరుగుమీది రొట్టలోనే మేను వాల్చితిని. లోనుండివచ్చి, పొట్టి పిచికి అరుగుమూల ఒరగినాడు.

# అక్కచెల్లెండ్రు లేమి

అక్కయుదమ్ముడునుగూడి యడుగులిడుచు, హస్తములు హస్తములజేర్చి యాటలాడి
సొంపునొయ్యారమును గనులార నింపునొంద, సంతసముగల్గదెవ్వారి స్వాంతములకు!
అక్కదమ్ముడు నుయ్యెలయందు జేరి, పాటబాడుచు నూగుచు నాటలాడ
తల్లిదండ్రుల చిత్తముల్ దనివినొంద, చూచువారికి సంతుష్టిదోచుగాదె!
అన్నదమ్ములుగల సౌఖ్యమబ్బుగాక, భోగభాగ్యంబులును హెచ్చుపొసగుగాక
పృథ్విమఱపించు భార్యలభించుగాక, అక్కచెల్లెండ్రు లేకుండు టార్తిగాదె?
అక్కచెల్లెండ్రు పురుషున, కన్నదమ్ములాడు వారికి, లేకున్ననవనియందు
సోదరీసోదరప్రేమ సుఖమెఱుగని, కొఱతచే జీవితంబెల్ల కుందు చుండ్రు!
పేదలై బొట్టగూటికి పెనగులాడు, మనుజులొకప్డు సంపదల్ బడయువచ్చు.
సోదరీసోదరులు లేనివేదనంబు, బాపుకొనుటకు వశమె ఎవ్వానికైన?

— దేవీ మహాశాస్త్రులు.